కనీస వసతులు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

వికారాబాద్ : ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబర్ 4 : ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న సిబ్బందికి కనీస వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించాలి. ఈ సందర్భంగా బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌తో పాటు అక్కడ ఏర్పాటు చేసిన భద్రత, పోలీసు బందోబస్తు తదితర వాటిని పరిశీలించారు. పరిసరాలను పరీక్షించి అక్కడున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాగునీరు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. రిజిస్టర్‌ను తనిఖీ చేసి సంతకాలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం నేహమత్ అలీ తదితరులు ఉన్నారు.

సర్వే వివరాల నమోదు వేగవంతం చేయాలి

పరిగి : సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం పరిగి లోని మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే వివరాల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు వివరాలు నమోదు ఏ మేరకు చేపట్టారు, ఇంకా ఎంత మిగిలి ఉన్నదని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. పనులను వేగవంతం చేసి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో శ్రీనివాస్, ఎంపీడీవో కరీం, సిబ్బంది ఉన్నారు.

తాండూరులో..

యాలాల : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, కుటుంబ సర్వే ప్రక్రియ జిల్లాలో పూర్తయిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు ప్రక్రియను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత నమోదు ప్రక్రియ పూర్తయిందని ఎన్యూమరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

అపర్ణ కంపెనీ ఆక్రమించిన భూములపై విచారణ

- కొండకల్ తండా, వెలిమలతండాలో కలెక్టర్ నారాయణ రెడ్డి పర్యటన
- విచారణకు హాజరైన ఆయా గ్రామాల గిరిజనులు

రంగారెడ్డి, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ) : మోకిళ్ల మండల పరిధిలోని కొండకల్‌తండా, వెలిమల తండాలో కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం పర్యటించారు. ఆయా తండాల్లో గిరిజన భూములను కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా లాక్కొని వివిధ కంపెనీలకు కట్టబెట్టడంతో గిరిజనులకు అన్యాయం జరిగిందని రెండు గ్రామాల గిరిజనులు, న్యాయవాదులు నలమాస కృష్ణ, కొండూరి వీరయ్య, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ తదితరుల ఆధ్వర్యంలో ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ భూములపై విచారణ జరపాలని ఎస్టీ కమిషన్ కలెక్టర్‌ను ఆదేశించింది. కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు శ్రీరాంనాయక్, రాంబల్‌నాయక్ మాట్లాడుతూ.. 1973నుంచి గిరిజనులు సాగు చేస్తున్న అసైన్డ్ భూములను అపర్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దౌర్జన్యంగా ఆక్రమించిందని తెలిపారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు కంపెనీ యాజమాన్యానికి వంత పాడుతూ.. గిరిజనులకు అన్యాయం చేశారన్నారు. తమ భూములను తమకు ఇవ్వాలంటూ ప్రశ్నించడానికి వెళ్లిన గిరిజనులపై కంపెనీ యజమానులు బౌన్సర్ల చేత కొట్టించారని ఆరోపించారు. ఆక్రమణకు గురైన భూములను తిరిగి గిరిజనులకు అప్పగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సంక్షోభంలో గురుకుల విద్య

- విద్యాశాఖ మంత్రి లేని హీన స్థితి
- విద్యార్థుల మరణాలు కనిపించడం లేదా..?
- ఫుడ్ పాయిజన్‌పై చర్యలు శూన్యం
- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు శేష్‌పాల్, జంగయ్య

గురుకులంలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్వీ నాయకులు

తాండూరు, డిసెంబర్ 4 : గురుకుల విద్యను సంక్షోభంలోకి నెట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు శేష్‌పాల్, జంగయ్య విమర్శించారు. బుధవారం జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రే యరావుతో కలిసి గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా తాండూరు పట్టణ పరిధిలోని టీజీడబ్ల్యూఆర్ఐఈఎస్(బాయ్స్), టీజీడబ్ల్యూఆర్ఐఈఎస్(గర్ల్స్) టీజీడబ్ల్యూఆర్ఎస్, ఎంజేపీలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గురుకుల బాట కార్యక్రమం ఈ నెల 7 వరకు కొనసాగనున్నదన్నారు. గురుకులాలు, కేజీబీవీ, మాడల్ స్కూళ్లలో పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరపున ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యయన కమిటీల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నామన్నారు. విద్యాశాఖ మంత్రి లేని హీన స్థితిలో రాష్ట్రం ఉందన్నారు. 11 నెలల్లో 48 మంది విద్యార్థులు చనిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. విద్యార్థుల మరణాల్లో 38 ఫుడ్ పాయిజన్ వల్ల సంభవించాయన్నారు. విద్యార్థులను పొట్టన పెట్టుకున్న ఈ ప్రభుత్వం మరణాలపై ఒక్క సమీక్ష కూడా నిర్వహించకపోవడం విడ్డూరమన్నారు. విద్యార్థుల మరణాలు, ఫుడ్ పాయిజన్‌పై తీసుకున్న చర్యలు శూన్యమన్నారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో అధికారులు, సిబ్బందిపై, విద్యార్థుల మరణాలకు కారణమైన వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. గురుకులాల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలతో ఉన్నారన్నారు. విద్యారంగ నిర్వహణలో నేరపూరిత నిర్లక్ష్యానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కారణమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్ శోభారాణి, మహిళా అధ్యక్షురాలు శకుంతల, నియోజకవర్గ అధ్యక్షుడు ఎబినైజర్, పట్టణ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌రావు, సలీం, నర్సింహ, ఇంతియాజ్, వినోద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

సదస్సు ప్రారంభోత్సవంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ భిక్షంరెడ్డి

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ భిక్షంరెడ్డి

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 4: సాంకేతికతను వినియోగించుకుంటూనే సైబర్ నేరాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ భిక్షంరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో 'సైబర్ స్పేస్‌లో మహిళల భద్రత' అనే అంశంపై మూడో అంతర్జాతీయ సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ, పల్లవి కాలేజీ చైర్మన్ మల్కా కొమురయ్యతో కలిసి భిక్షంరెడ్డి సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆన్‌లైన్ వేధింపులు, ట్రోలింగ్, సైబర్ నేరాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. మహిళల భద్రత కోసం సైబర్ సెక్యూరిటీ విభాగంలో ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. సైబర్ నేరాలబారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. యువత సైబర్ భద్రతా నిబంధనలను పాటిస్తూనే.. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో 51 పరిశోధన పత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాచకొండ కమిషనరేట్ నుంచి సైబర్ క్రైం ఎస్సై సత్యనారాయణ, ఉమెన్స్ సేఫ్టీ ఎస్సై ఎం.రాజు, కమలాబాయి, సీఎస్ఐ మెంబర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, కాలేజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్కా నవీన్‌కుమార్, కాలేజీ ప్రతినిధులు రామ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఎంబీ రాజు, ఎం కృష్ణ, అడ్మినిస్ట్రేషన్ డీన్ అంబాల శ్రీధర్, సాయి హరీశ్, రవి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్

అడవుల సంరక్షణపై దృష్టి కేంద్రీకరించాలి

- అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్
- అడవిలో విద్యార్థులతో కలిసి నేచర్ వాక్

వికారాబాద్, డిసెంబర్ 4 : అడవుల సంరక్షణపై విద్యార్థులు, యువత దృష్టి కేంద్రీకరించాలని అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో 300 మంది వివిధ పాఠశాలల విద్యార్థులకు అడవుల సంరక్షణపై అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అంతకు ముందు అటవీ శాఖ జిల్లా కార్యాలయం నుంచి అడవిలోని విద్యార్థులతో కలిసి నేచర్ వాక్ నిర్వహించారు. అక్కడ ఉన్న వివిధ రకాల చెట్లను చూయిస్తూ.. వాటితో కలిగే ఉపయోగాలు, మొక్కల పెంపకం, చెట్ల సంరక్షణ తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులతో అధికారులు ముఖాముఖి నిర్వహించారు. అడవిలో పర్యటించి ఏమి నేర్చుకున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారు ఎంతో చురుగ్గా సమాధానాలు ఇచ్చారు. అనంతరం అటవీ శాఖ జిల్లా అధికారి మాట్లాడుతూ.. అనంతగిరి అడవుల ప్రాముఖ్యత, విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వికారాబాద్, ధారూరు అటవీ క్షేత్ర అధికారులు శ్యామ్ కుమార్, రాజేందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మిషన్లకు సంబంధించిన వారెంటీ కార్డులను అందజేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా ప్రత్యేక న్యాయాధికారి అశోక్

జిల్లా ప్రత్యేక న్యాయాధికారి చేయూత

వికారాబాద్, డిసెంబర్ 4 : వికారాబాద్, తాండూరు కోర్టుల్లో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న స్వీపర్లు, కుక్ తదితరులకు జిల్లా ప్రత్యేక న్యాయాధికారి నామాల అశోక్ కుట్టు మిషన్లను అందించేందుకు కృషి చేస్తున్నారని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కార్యాలయంలో వారికి కుట్టు మిషన్లకు సంబంధించిన వారెంటీ కార్డులు, ఇతర పత్రాలను అందజేశారు. కోర్టు పరిధిలో పని చేస్తున్న వారికి చేయూతనిస్తున్న ప్రత్యేక న్యాయాధికారిని ఎస్పీ సన్మానించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

డీఈవో రేణుకాదేవి

పూడూరు పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో రేణుకాదేవి

పూడూరు, డిసెంబర్ 4 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో రేణుకాదేవి సూచించారు. బుధవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి, కంకల్ పాఠశాలలను ఆమె సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఆయా తరగతుల విద్యార్థులను పలు పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థులకు అందించే మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనం, భోదన విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఎంఈవో సాయిరెడ్డి, ఉపాధ్యాయులు పుష్ప, లక్ష్మణ్, సీఆర్‌పీలు గాలయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

అనువైన పోలింగ్ బూత్‌లను గుర్తించాలి

- నర్సరీల నిర్వహణలో అజాగ్రత్త తగదు
- రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి
- పంచాయతీ కార్యదర్శులతో పలు అంశాలపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

ఆమనగల్లు, డిసెంబర్ 4: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అనువైన పోలింగ్ బూత్‌లను గుర్తించాలని రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి సూచించారు. ఓటర్లు, పోలింగ్‌కు అనుకూలమైన పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలను పరిశీలించి తగిన వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కుసుమ మాధురి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీఈవో హాజరయ్యారు. సమావేశంలో మండల పరిధిలో పథకాల అమలు, అసంపూర్తి పనులపై చర్చించారు. సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్‌లో ఎంట్రీ పూర్తయిన వెంటనే సర్వే పత్రాలను ట్రంకు బాక్సుల్లో భద్రపరచాలని సూచించారు. సర్వే వంద శాతం పూర్తయిందని ఎంపీడీవో తెలిపారు. సీఎం కప్ పోటీలకు అర్హులైన వారందరూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా ప్రజలకు వివరించాలని సీఈవో పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నర్సరీల నిర్వహణలో అజాగ్రత్త తగదన్నారు. పారిశుధ్య కార్యక్రమాల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న పాత భవనాలను తొలగించడానికి ఎంపిక చేసిన వాటిని సీఈవో పరిశీలించారు. సమావేశంలో ఏపీవో మాధవ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజయోత్సవాలు కాదు.. వైఫల్యోత్సవాలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పరిగి, డిసెంబర్ 4 : కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనంతా మోసాలమయమని, నిర్వహించాల్సింది విజయోత్సవాలు కాదు.. వైఫల్యోత్సవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి అన్నారు. బుధవారం పరిగిలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్ బూనేటి, అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య, ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్యతో కలిసి మాట్లాడారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నప్పటికీ పాలమూర్-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత నాలుగు దశాబ్దాలుగా పరిగి ప్రాంత ప్రజలు కలలుగంటున్న వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ కొడంగల్, నారాయణపేట మీదుగా మళ్లించడానికి ప్రయత్నిస్తున్నారని, తద్వారా పరిగి ప్రాంత ప్రజలకు అన్యాయం జరగదా అని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో పేదలకు ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, పెన్షన్ డబ్బులు పెంచలేదని, ఒక్క ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు అమలు చేయకపోగా 66 మోసాలకు పాల్పడిందని విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో 7వ తేదీన బైక్ ర్యాలీ నిర్వహిస్తామని వారు తెలిపారు. మహ్మదాబాద్‌లో బైక్ ర్యాలీ ప్రారంభమై పరిగి వరకు, పూడూరు నుంచి పరిగి వరకు కలిపి కొడంగల్ చౌరస్తాకు చేరుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పరిగి పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాముయాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాటన్‌పల్లి అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): పోలీసు శాఖలోని ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్ల భర్తీ ప్రక్రియ షురువైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్ల ఎంపిక ప్రక్రియను బుధవారం గోషామహల్‌లోని పోలీస్ స్టేడియంలో నగర పోలీసు కమిషనర్ సీవీ. ఆనంద్ ప్రారంభించారు. సోషల్ వెల్ఫేర్ శాఖ ఇచ్చిన అభ్యర్థుల జాబితా ప్రకారం మొత్తం 58 మంది ట్రాన్స్‌జెండర్లకు ఫిజికల్ ఈవెంట్ నిర్వహించగా, అందులో 44 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ మీ కమ్యూనిటీకి ఒక రోల్ మాడల్ కావాలంటూ.. ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ఎంపికైన ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. సమాజంలో ఒక గుర్తింపు ఇవ్వడానికి ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని వినియోగించుకొని, పోలీసు శాఖకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంపించిన నగరం..భయం..భయం

- రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు



సిటీబ్యూరో, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ) : తెలంగాణలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న ములుగు జిల్లాకు సమీపంలో ఏర్పడిన భూకంప తరంగాలు నగరం వరకు విస్తరించాయి. భూమి ఉపరితలం నుంచి 40 కిలోమీటర్ల లోతున ఏర్పడిన భూకంప కేంద్రంతో నగరంలోని యూసుఫ్‌గూడ, రహ్మత్ నగర్, బోరబండ, ఇబ్రహీంపట్నంతో పాటు, మరికొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపించినట్లు సిటీ జనాలు పేర్కొన్నారు. కొంత మంది నెటిజన్లు ఉదయం సంభవించిన భూకంపంతో... తమ ప్రాంతాల్లోనూ భూమిలో కదలికలు వచ్చాయని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఉదయం 7.27 గంటల ప్రాంతంలో ములుగు జిల్లాకు 200 కిలోమీటర్ల దూరంలో ఉండే హైదరాబాద్ వరకు విస్తరించింది. దీంతోపాటు ఏపీలోని పలు జిల్లాలు, తెలంగాణకు సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర జిల్లాల్లోనూ భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భూమి అడుగున ఉండే పొరలు తరచూ సర్దుబాట్లకు గురవుతుంటాయని, అందుకే భూకంపాలు వస్తాయని సైంటిస్టులు వివరించారు. భూమిలో ప్రధానంగా 16 రకాల పలకలు ఉంటాయి.. నిత్యం వివిధ దిశల్లో ప్రయాణిస్తుంటాయి. భారతదేశం ఉన్న ఫలకం ఉత్తర దిశలో ఏటా 5-6 సెం.మీటర్లు పయనించి ఆసియా ఫలకలతో ఢీకొంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఏర్పడే ఒత్తిడి కారణంగా భూమి లోపల పొరల మధ్య కదలికలు వచ్చి భూకంపం సంభవిస్తుందన్నారు. దీనివల్ల ఉద్భవించే తరంగాలు చుట్టూరా వందల కిలోమీటర్ల వరకు విస్తరించడంతో ఇతర ప్రాంతాల్లోనూ భూమి కంపిస్తుందని పేర్కొన్నారు. 55 ఏండ్ల కిందట భద్రాచలంలో రిక్టర్ స్కేల్‌పై 5.7 మ్యాగ్నిట్యూడ్ తీవ్రత కలిగిన భూ ప్రకంపనలు రాగా, తాజాగా 5.3 మ్యాగ్నిట్యూడ్ భూకంపం రెండో అతిపెద్దదిగా పరిశోధకులు పేర్కొన్నారు. అయితే తెలంగాణకు భూకంపాలతో వచ్చే ప్రమాదం తక్కువేనని, ఈ ప్రాంతం సెస్మిక్ జోన్-2లో ఉన్నట్లు చెప్పారు.

పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ఆర్కేపురం, డిసెంబర్ 4 : ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ ముందు విజయవాడ-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారికి, సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియ రెండో రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పండ్ల వ్యాపారం చేసుకునే దళారులు రోజువారీ కూలీలను పెట్టి మరీ రోడ్డుకు ఇరువైపులా ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు తోపుడు బండ్లు, ఆటోలలో పండ్లు, కూరగాయలు పెట్టి అమ్ముతూ నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పుట్‌పాత్‌లను అడ్డాగా చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ అదనపు సీఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల పనివేళల్లో మార్పు



సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో పారిశుధ్య కార్మికుల పనివేళల్లో మార్పులు తేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. విధుల హాజరు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ఉండగా, తాజాగా 6 నుంచి 7 గంటల వరకు పెంచారు. ఔట్ టైం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు పనివేళలను నిర్ణయించారు. చలి తీవ్రత దృష్ట్యా కార్మికుల విజ్ఞప్తి మేరకు గతంలో కంటే గంట ముందుకు జరిపారు.

ఎంఈడీ పరీక్ష తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఓయూ పరిధిలోని ఎంఈడీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎండీహెచ్ఎం పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4 : ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 9 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను నెలలోనే నిర్వహించనున్నటు, పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని హిస్టరీ విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ హిస్టరీ కోర్సును బోధించేందుకు అర్హులు హిస్టరీ సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పూర్తి చేయడంతో పాటు నెట్, సెట్‌లో అర్హత సాధించడం లేదా పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 7న సాయంత్రం 5 గంటల్లోపు తమ దరఖాస్తులను తన కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు.